తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ శనివారం 01 - 08 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 6


# మోత్కూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా



- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసిన మోత్కూరు మున్సిపల్ కౌన్సిలర్లు

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం, పలు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మోత్కూరు మున్సిపల్ కౌన్సిలర్లు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసి అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం వినతిపత్రం అందజేసి విన్నవించారు. మోత్కూరు మున్సిపాలిటీలో అంబేద్కర్ చౌరస్తా నుండి రిజిస్ట్రేషన్ ఆఫీసు వరకు బీటీ రోడ్డు, సైడ్ డ్రైన్ నిర్మాణం. హైస్కూల్‌లో ఓపెన్ జిమ్, అన్నెపువాడ, సాయినగర్‌లో మినీ ఫంక్షన్ హాళ్లు, ఓపెన్ జిమ్, గాంధీనగర్‌లో ఓపెన్ జిమ్ తదితర అభివృద్ధి పనులను నిధులు మంజూరు చేయాలని కోరారు. మోత్కూరు జ్యోతిరావు పులే చౌరస్తా నుండి ముశిపట్ల మీదుగా దత్తప్పగూడెం వరకు, మోత్కూరు నుండి పనకబండ, రాగిబావి వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరగా మంత్రి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించి మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్, బీసు శ్రీకాంత్ గౌడ్, మెంట రమణనాగేష్, మొగుళ్ల అనురాధ, గనగాని శైలజ, కుర్మిళ్ల ప్రమీల, పన్నాల శ్రీవిద్య, నాయకులు బొల్లేపల్లి శ్రవణ్, ఆలకుంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాగిబావిలో దళితుల భూసమస్యలను పరిష్కరించాలి

- ఎస్సీ కార్పొరేషన్ వేయించిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇప్పించాలి
- దళిత విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం అమలు చేయాలి
- రాగిబావి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం

## డీవీఎంసీ మెంబర్ దాసరి తిరుమలేష్



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో ప్రభుత్వం దళితులకు మూడెకరాల చొప్పున భూపంపిణీ చేసిందని, ఆ భూములకు దారితో పాటు హద్దుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ కోరారు. మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రైతులకు బోర్లు వేయించారని, కానీ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని, వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. ఎస్సీ కాలనీలో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్ల పై నుంచి ఐదారేళ్ల క్రితం విద్యుత్ లైన్ వేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంభయంగా జీవిస్తున్నారని, వెంటనే ఆ లైన్ తొలగించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో దళిత పేద విద్యార్థులకు 1వ తరగతి నుంచి 5వ వరకు ఉచిత అందించాల్సి ఉండగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు తీసుకోవడం లేదని, ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 5వ తరగతి విద్యార్థులు దరఖాస్తులు తీసుకుని డ్రా తీయకపోవడంతో వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. అన్ని కులాలు సమానమేనని, కుల వివక్ష సమస్య లేకుండా ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవాణిచంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎలుగు యాదిరెడ్డి, కరుణాకర్, నర్సింగరావు, అన్నపూర్ణ, పూజ, ఉపేందర్, డీఈ రమావత్ మంగులాల్, పీఆర్ ఏఈ శివ, పంచాయతీ కార్యదర్శి జి.చంద్రశేఖర్, జీపీవో ప్రవీణ్, ఏఎన్ఎం పార్వతి, ఆశావర్కర్ నవ్య, అంగన్‌వాడి టీచర్ స్వప్న, రేషన్‌డీలర్ వెంకట్‌రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, రాంపాక కరుణాకర్, రాంపాక మల్లేష్, బండారి యాదయ్య, చంద్రయ్య, అమృతరెడ్డి, సాలమ్మ, వెంకటమ్మ, స్వాతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ హెల్త్‌కార్డులను..

# కార్పొరేట్ ఆస్పత్రులకు లింక్ చేయాలి

**రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అవిశెట్టి అవిలిమల్లు**



ప్రజావారధి/మోత్కూరు

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే డిజిటల్ హెల్త్ కార్డులతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేలా లింక్ చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అవిశెట్టి అవిలిమల్లు కోరారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం యూనిట్ భవనంలో శుక్రవారం జూలై నెలలో పుట్టినరోజు ఉన్న రిటైర్డ్ టీచర్ల సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన అందేలా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో కార్డులను సద్వినియోగం చేసుకునేలా అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం పుట్టినరోజు జరుపుకున్న రిటైర్డ్ ఉద్యోగులు ఆర్.రాఘవులు, చేపూరి భిక్షం, తొగిటి మనోహరాచారి, జి.బుచ్చమ్మ, గంధం భారతమ్మ, ఎండి.మునీరుద్దీన్, కలిమెల నర్సయ్య, తాడిశెట్టి శార్వాణి, అనంత పద్మనాభంలను సన్మానించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బద్దం యాదిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ఎ.వల్లభాయి, ఉపాధ్యక్షుడు తొగిటి మనోహరాచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బైరెడ్డి రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శి పరకాల నర్సయ్య, ప్రచార కార్యదర్శి బయ్యని వెంకటేశ్వర్లు, జిల్లా ప్రతినిధి సురోజు భాస్కరాచారి, కోశాధికారి వారాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సోనూసూద్‌ను కలిసిన రాజమాత ఫౌండేషన్ సభ్యులు

ప్రజావారధి/మోత్కూరు




ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ రాజమాత ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ముంబైలోని ఆయన నివాసంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించగా అభినందించారు. యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలోని రాజామాత ఫౌండేషన్ ఎడ్యుకేషన్ సెంటర్‌కు ఆయన్ను ఆహ్వానించగా త్వరలోనే వస్తానని హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలోరాజమాత ఫౌండర్ ఉదయ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
01 - 08 - 2026

# సీపీఎం సీనియర్ నేత గన్నపురెడ్డి చంద్రారెడ్డి కన్నుమూత

**ప్రజావారధి/శాలిగౌరారం**

శాలిగౌరారం మండలం మనిమద్దె గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గన్నపురెడ్డి చంద్రారెడ్డి (75) శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఉన్నారు. చంద్రారెడ్డి బాల్యం నుంచే ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. కార్మిక, కర్షక



సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం కృషి చేశారు. సీపీఎం లో క్రియాశీలకంగా పనిచేస్తూ చివరి వరకు ఎర్రజెండాను వద లేదు. మనిమద్దె గ్రామ నీటి సంఘం చైర్మన్‌గా కూడా ఆయన సేవలందించారు. చంద్రారెడ్డి అకాల మరణం పట్ల శాలిగౌరారం మండల సీపీఎం కార్యదర్శి చలకాని మల్లయ్య, పార్టీ సీనియర్ నాయకులు సిరుపంగి రాములు, కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, బట్ట చినభిక్షం, జూలూరి శేఖర్, దాసరి దేవచిత్తం, మనిమద్దె గ్రామ కాంగ్రెస్ నాయకులు దొంతూరి రామచంద్రు, దొంతూరి శంకర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు నాయకులు, కార్యకర్తలు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

# గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందజేయాలి



**ప్రజావారధి/శాలిగౌరారం**

ప్రతీ గీత కార్మికునికి ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, 50 ఏళ్ళు నిండిన కార్మికులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్ కోరారు. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో శుక్రవారం కల్లుగీత సహకార సంఘం ఆధ్వర్యంలో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల యాదిలో బస్సు యాత్ర ఈనెల 2న మహబూబాబాద్ జిల్లాలో ప్రారంభమవుతుందని, యాత్ర ఈ నెల 6న నల్గొండ జిల్లాలో ప్రవేశించి ఉదయం 9 గంటలకు నకరేకల్ పట్టణానికి వస్తుందని, ఇందిరాగాంధీ సెంటర్లో రోడ్డు షో నిర్వహించడం జరుగుతుందన్నారు. గీత కార్మికులు మోకు ముస్తాదులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, ఈత, తాటి, ఖర్జూర వనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మండల కార్యదర్శి గుడుగుంట్ల బుచ్చి రాములుగౌడ్, వల్లాల గీత సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొంపెల్లి వెంకన్న గౌడ్, కట్టగూరి వీరయ్య, డైరెక్టర్లు మాధగోని అచ్చాలు, మాధగోని నర్సింహ, భూపతి వెంకటేశ్వర్లు, కట్టగూరి శ్రీను, పోగుల శంకర్, బోడిగె నాగయ్య, కారింగుల వెంకన్న, మాధగోని సైదులు గౌడ్, భూపతి సత్యనారాయణ, మాధగోని రాములు, మాదగోని రామలింగయ్య, వేముల రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
01 - 08 - 2026

# బెల్ట్ షాపులపై ఎస్వోటీ పోలీసుల దాడులు



- మోత్కూర్ మండలం పాటిమట్ల ఎక్స్ రోడ్డులో బెల్ట్ షాపులపై మూకుమ్మడి దాడులు
- 5 షాపుల్లో ఏకకాలంలో పోలీసుల తనిఖీలు
- సుమారు రూ.లక్ష మద్యం పట్టివేత



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామ ఎక్స్ రోడ్‌లో శుక్రవారం ఎస్ఓటి పోలీసులు బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. పాటిమట్ల ఎక్స్ రోడ్లో పెద్ద ఎత్తున బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఏకకాలంలో బెల్ట్ షాపులపై దాడులు చేసి పెద్ద ఎత్తున నిల్వ ఉన్న మధ్యాన్ని పట్టుకున్నారు. ఆరు షాపులపై దాడులు చేసి సుమారు రూ.లక్ష విలువైన మద్యం పట్టుకున్నారు. పోలీసుల దాడులను పసిగట్టిన మరో ఐదారు బెల్ట్ షాపుల నిర్వాహకులు షాపులు మూసేసి పరారయ్యారు. మోత్కూర్ వైన్స్ షాపుల యజమానులు ఎవరూ పట్టుకోరని చెబితేనే వారి షాపుల నుంచి మద్యం కొని తెచ్చి అమ్ముతున్నామని బెల్ట్ షాపుల నిర్వాహకులు చెప్పడం గమనార్హం. పాటమట్ల గ్రామంలో, ఎక్స్ రోడ్ లో ఇష్టారాజ్యంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారని ఎక్సైజ్ పోలీసులకు, సివిల్ పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎస్ఓటి పోలీసులు దాడులు చేసి పట్టుకున్న మద్యాన్ని మోత్కూర్ పోలీసులకు అప్పగించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, బెల్ట్ షాపుల నిర్వాహకులపై మోత్కూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

**నేతన్న భరోసా, నేతన్న పొదుపు బకాయిలను విడుదల చేయాలి**

**చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు**

## చేనేత పథకాల అమలులో

# కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

ప్రజావారధి/మోత్కూరు

చేనేత పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, దీంతో కార్మికులకు పథకాలు అందకపోవడంతో నష్టపోతున్నారని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో శుక్రవారం ఆయన చేనేత కార్మికులతో కలిసి విలేకరుల తో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా, నేతన్న పొదుపు పథకాల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్న పొదుపు పథకం ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్నప్పటికీ అమలులో జాప్యం చేస్తుందన్నారు. చేనేత కార్మికులకు వచ్చిన వేతనంలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కార్మికులు పొదుపు ఖాతా ఆర్‌డీ వన్ బ్యాంకు ఖాతల్లో జమ చేస్తుండగా, ప్రభుత్వం జమ చేయాల్సిన ఆర్‌డీ టు నిధులను సంవత్సర కాలంగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం లేదని తెలిపారు. చేనేత కార్మికులకు నేతన్న భరోసా క్రింద ప్రతినెల కార్మికునికి రూ.2 వేలు, అనుబంధ కార్మికులకు రూ. వెయ్యి చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించిం దని, ఏడాదికి నాలుగు విడతల్లో అమలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం ఒక్క విడత డబ్బులు మాత్రమే జమ చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే నేతన్న భరోసా, నేతన్న పొదుపు బకాయి నిధులను విడుదల చేసి కార్మికులు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జెల్ల నాందేవ్, వడ్డేపల్లి లక్ష్మణ్, జెల్ల సత్యనారాయణ, చింతకింది సోమరాజు ఆయన వెంట ఉన్నారు.



ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
01 - 08 - 2026

# పీఆర్సీ ప్రకటించి..
# పెండింగ్ డీఏలు విడుదల చేయాలి




**ప్రజావారధి/మోత్కూరు**
ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వెంకటాచారి డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మోత్కూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయులు నిరాశలో ఉన్నారని, డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెల్త్ కార్డుల జారీలో ఆలస్యం చేయకుండా సరైన మార్గదర్శకాలు విడుదల చేసి కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసేయకుండా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మోత్కూరు మండల అధ్యక్షుడు దర్శనం వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఎ.సత్తయ్య, సహ అధ్యక్షుడు ఉప్పలయ్య, కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.